క్లుప్తంగా

కూర్మావతారంలో సీతారామస్వామి


కూర్మావతారంలో దర్శనమిచ్చిన మెయిన్ రోడ్డులోని సీతారామస్వామి

బోట్‌క్లబ్: రజిత చిన్న దశావతార అలంకార ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సీతారామస్వామి కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు భావవరపు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల రక్తదానం


రక్తదానం చేస్తున్న బ్యాంక్ ఉద్యోగులు

బాలాజీచెరువు: ప్రముఖ స్వాతంత్ర యోధుడు భోగరాజు పట్టాభిరామయ్య జయంతి సందర్భంగా ఆంధ్రాబ్యాంక్ ఉద్యోగులు ఆదివారం రక్తదానం చేశారు. గాంధీనగర్ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీలో ఈ రక్తదాన శిబిరాన్ని యూనియన్ బ్యాంక్ కాకినాడ హెడ్ సాయి మనోహర్ ప్రారంభించారు. బ్యాంక్ ఎంప్లాయీస్ కో-ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి కర్రి ఆదినారాయణ, బ్యాంక్ ఉద్యోగులు పాల్గొన్నారు.

లయన్స్ ఎలైట్ గ్రామీణ వైద్య శిబిరాలు


సమావేశంలో పాల్గొన్న క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: దూరంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా అత్యాధునిక సేవలందించాలన్న ప్రతిపాదనను లయన్స్ ఎలైట్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఆమోదించిందని క్లబ్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. క్లబ్ సమావేశం ఆదివారం టౌన్‌హాల్‌లో జరిగింది. ఈ సమావేశంలో క్లబ్ కార్యవర్గం పలు ప్రతిపాదనలు ఆమోదించింది. బీఆర్ఎం కేర్‌వెల్ హాస్పిటల్ వైద్యులు మైలవరపు సత్యనారాయణ సహకారంతో భారీ వైద్య శిబిరాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సుబ్రహ్మణ్యం చెప్పారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల కోసం కూడా క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి రాఘవరావు, క్లబ్ సభ్యులు కటకం శ్రీనివాస్, సాగర్, వరప్రసాద్ పాల్గొన్నారు.

భక్తులకు మొక్కల పంపిణీ

బోట్‌క్లబ్: ప్రముఖ దంత వైద్యుడు అడ్డాల సత్యనారాయణ 18వ సారి శబరిమల యాత్ర సందర్భంగా ఆదివారం స్థానిక విద్యుత్‌నగర్‌లోని కల్యాణ మండపంలో అయ్యప్పలకు మొక్కలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుంకర మాధవకృష్ణ, సుంకర విద్యాసాగర్ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలపై ప్రసంగించారు.


కరప శివాలయంలో ధ్వజస్తంభం వద్ద మహిళల పూజలు


బాలాత్రిపుర సుందరి ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు


త్ర్యంబకేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు

భక్తజన పులకింత

- భక్తిశ్రద్ధలతో స్వామి, అమ్మవార్లకు పూజలు
- భారీ ఎత్తున భక్తుల పౌర్ణమి స్నానాలు


కాకినాడ బీచ్‌లో పౌర్ణమి స్నానాలు చేస్తున్న భక్తులు

కరప: మండలంలోని అనేక గ్రామాల్లో ఆదివారం కార్తిక పౌర్ణమి పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కరప, నడకుదురు, గురజనాపల్లి, గొర్రిపూడి, పెద్దాపురప్పాడు, పెనుగుదురు, గొర్రిపూడి, వేళంగి, సిరిపురం, కూరాడ, వేములవాడ, వాకాడ, అరట్లకట్ట, జెడ్.భావారం, కొరిపల్లి తదితర గ్రామాల్లోని విష్ణాలయం, శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు వేకువజామునే ఆలయాల్లో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేయించారు. స్థానిక విష్ణాలయంలో రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాల స్వామివారికి ప్రధానార్చకుడు పెద్దింటి అనంతాచార్యులు, గోపాలకృష్ణ పూజాదికాలు నిర్వహించారు. కరప పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు. శివాలయంలో అర్చకుడు విలపర్తి శ్రీనివాస్ స్వామి, అమ్మవార్లకు పూజలు చేశారు. మహిళలు ఆలయాల్లో దీప, సాలిగ్రామ, ఉసిరి, కొబ్బరి బోండాలను బ్రాహ్మణులకు దానమిచ్చారు. యండమూరులోని సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు పెద్దింటి సీతారామచార్యులు పూజలు నిర్వహించారు.

భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిట

బోట్‌క్లబ్: కార్తిక పౌర్ణమి సందర్భంగా నగరంలోని శైవక్షేత్రాలు భక్తులతో ఆదివారం కిటకిటలాడాయి. స్థానిక బాలాత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు బంగారం చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలోని ఉసిరిచెట్టు వద్ద, ధ్వజస్తంభం వద్ద భక్తులు దీపాలు వెలిగించి, పూజలు చేశారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆలయంలో జ్వాలాతోరణ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వాకాడ వీరవెంకట సత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్థానిక రామారావుపేట శివాలయం, మాధవనగర్‌లోని శివాలయంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న శివాలయాల్లో కార్తిక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి.

త్ర్యంబకేశ్వరుని దర్శించుకున్న ఎస్పీ దంపతులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఆర్టీసీ కాలనీలోని పార్వతీ సమేత త్ర్యంబకేశ్వరస్వామిని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎస్పీ దంపతులకు స్వాగతం పలికారు. అర్చకుడు చైతన్య తదితరులు గోత్ర నామాలతో అభిషేకాలు నిర్వహించారు.

సాగర తీరంలో కార్తిక సందడి

కాకినాడ రూరల్: కార్తిక పౌర్ణమి సందర్భంగా నోములు ఆచరిస్తూ, ఉపవాసాలున్న భక్తులు వేలాదిగా కాకినాడ సాగర తీరానికి తరలివచ్చి, పుణ్య స్నానాలు ఆచరించారు. సూర్యారావుపేట వద్ద ఆదివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ పౌర్ణమి స్నానాలతో భక్తులు సందడి చేశారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్నానాలకు రావడంతో, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

నేడు స్పందన, డయల్ యువర్ కమిషనర్


కమిషనర్ నాగ నరసింహారావు

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ఈ నెల 27 (సోమవారం) ఉదయం 9:30 నుంచి 10:30 వరకు డయల్ యువర్ కమిషనర్ నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు తెలిపారు. స్థానిక సమస్యలను కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయం ఫోన్ నంబర్ 08842357800కు కాల్ చేసి సమస్యలు తెలియజేయవచ్చన్నారు. ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. అలాగే 10:30 నుంచి స్పందన కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

డాక్టర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని హైదరాబాద్ కేంద్రీయ వర్సిటీ వీసీ ఆర్ఎస్ సర్రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు కర్రి భామిరెడ్డి పాల్గొన్నారు.

మీ దీవెనలే విజయానికి నాంది


క్రైస్తవులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- క్రైస్తవులతో ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: క్రైస్తవులు చేసే ప్రార్థనలు, అందించే దీవెనలే తమ విజయానికి నాంది అని సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తొమ్మిదో డివిజన్ గుడారిగుంట లక్ష్మీనగర్‌లోని యహోవా షమ్మ చర్చ్, సీతారామ నగర్‌లోని విడుదల చర్చ్‌లను సందర్శించారు. అక్కడకు వచ్చిన క్రైస్తవులను కలిసి రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను గెలిపించేందుకు ప్రార్థనలు చేయాలని కోరారు. క్రైస్తవుల అభివృద్ధి సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న చర్యలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాలూ గౌరవప్రదంగా, సుఖ సంతోషాలతో జీవించాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారన్నారు. అటువంటి ముఖ్యమంత్రి మళ్లీ అధికారంలోకి వస్తే.. పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మాజీ కార్పొరేటర్ కంపర బాబి, ఆయా చర్చిల పాస్టర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల కార్తిక సమారాధన


మతుకుమల్లి శ్రీవిజయ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ ఫెడరేషన్ (యూపీఈఐఎఫ్) ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల కార్తిక సమారాధన ఆదివారం కాకినాడ బీచ్ రోడ్‌లో నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల పాఠశాలల కరస్పాండెంట్లు ఉల్లాసంగా గడిపారు. ఫెడరేషన్ పటిష్టతతో పాటు, సమస్యల పరిష్కారానికి పోరాటం చేయడానికి ఐక్యంగా ఉండాలని నిర్ణయించారు. అనంతరం రాష్ట్ర లీగల్ అడ్వయిజర్, హైకోర్టు న్యాయవాది మతుకుమల్లి శ్రీవిజయ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థల చైర్మన్లు నూతలపాటి పూర్ణచంద్రరావు, కనకరాజు, గొల్లపూడి మారుతీరావు, సామా ఈశ్వరరావు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితోనే సంక్షేమ పథకాలు

రాజ్యాంగ దినోత్సవాల్లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, కురసాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితోనే పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని కన్నబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ధరణి ఉన్నంత వరకూ అంబేడ్కర్‌ను మరవలేమన్నారు. ప్రపంచ మేధావుల్లో అంబేడ్కర్ మహామేధావి అన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టరు అనుసూరి ప్రభాకర్, హితకారిణి డైరెక్టర్ దూనబోయిన అరుణ, ఏఎంసీ డైరెక్టర్ జాన్ ప్రభాకర్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిల్లి దేవరాజు, గగారిన్, మోకా కృష్ణంరాజు, తోటకూర శ్రీనివాస్, తర్లంపూడి నాని తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ ఆపరేటర్లకు కేంద్ర లైసెన్సులు

హామీ ఇచ్చిన ఎంఐబీ జాయింట్ సెక్రటరీ


సంజీవ్ శంకర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బండారు కృష్ణ తదితరులు

కాకినాడ క్రైం: కేబుల్ ఆపరేటర్ వ్యవస్థ ఉనికి, వృద్ధికి కేంద్రం పూర్తి సహకారం అందిస్తుందని ఎంఐబీ జాయింట్ సెక్రటరీ సంజీవ్ శంకర్ పేర్కొన్నారు. కాకినాడ నుంచి ఢిల్లీకి వెళ్లిన డిజిటల్ సర్వీస్ ఫెడరేషన్ ప్రొవైడర్స్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ బండారు కృష్ణమూర్తి తన బృందంతో కలిసి సంజీవ్‌శంకర్‌తో చర్చలు జరిపారు. కేబుల్ ఆపరేటర్లందరికీ కేంద్ర లైసెన్సు మంజూరు చేయనున్నట్టు సంజీవ్‌శంకర్ హామీ ఇచ్చారు. ఈ మేరకు, త్వరలో పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్న బ్రాడ్ కాస్టింగ్ బిల్‌లో ఈ అంశాన్ని చేర్చనున్నట్టు తెలిపారు. సమావేశ కీలకాంశాలను ప్రస్తావిస్తూ కృష్ణమూర్తి ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇంటింటితో సత్సంబంధాలు కలిగి ఉండే కేబుల్ ఆపరేటర్ల వ్యవస్థ ఎంతో కీలకమైనదని సంజీవ్ శంకర్ పేర్కొన్నారన్నారు. లైసెన్సు ప్రక్రియ కోసం ఎంఐబీ ప్రత్యేక పోర్టల్‌ను రూపొందించనున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్జాల విస్తృతిని పెంచేందుకు జీఎస్టీ, ఏజీఆర్ టాక్స్ సబ్సిడీ ప్రతిపాదన చేశారన్నారు. ప్రతి ఇంటికీ ఫైబర్ టు హోం యంత్ర పరికరాలు కొనుగోలు, నెట్‌వర్క్ నిర్వహణకు కేబుల్ ఆపరేటర్లకు అవసరమయ్యే నిధుల కోసం రూ.10 లక్షల వరకు ముద్ర లోన్, రూ.50 లక్షల వరకు ఎంఎస్ఎంఈ స్కీం ద్వారా రుణాలు ఇచ్చేందుకు నిర్ణయించారన్నారు. ఇంటర్నెట్ బ్యాండ్ విడ్త్, డార్క్ ఫైబర్ బ్యాక్ బోన్ సపోర్టు కోసం బీఎస్ఎన్ఎల్, బీబీఎన్ఎల్ సంస్థల సహకారం అందించాలని కేంద్రం నిర్ణయించిందని తెలిపారు. త్వరలో ప్రవేశ పెట్టనున్న బిల్లులో ఆయా అంశాలు చేర్చేందుకు ఆమోదం లభించిందని బండారు కృష్ణ తెలిపారు. సంబంధిత సమస్యలపై ఆయా శాఖల ముఖ్య అధికారులకు వినతిపత్రం సమర్పించిన వారిలో ఏఐడీసీఏ జనరల్ సెక్రటరీ మనోజ్, డీఎస్‌పీఎఫ్ ప్రెసిడెంట్ వినయ్ రాజు పాటిల్, వినీత్ త్రిపాఠి, ట్రెజరర్ యోగేష్ శర్మ, ఫారాగ్ పాటిత్ తదితరులు ఉన్నారన్నారు.

ఈ-వ్యర్థాల నిర్వహణ ప్రయోజనకరం

- కాకినాడ ఎంపీ వంగా గీత


ర్యాలీలో పాల్గొన్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు

కాకినాడ: పర్యావరణానికి ఈ-వ్యర్థాలతో తీవ్ర హాని కలుగుతుందని కాకినాడ పార్లమెంట్ సభ్యురాలు వంగా గీత పేర్కొన్నారు. తగిన జాగ్రత్తలు వహించడం ద్వారా నష్టాలను నివారించవచ్చని చెప్పారు. కాకినాడలో ఈ-వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభించి, మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం భానుగుడి నుంచి సర్పవరం జంక్షన్ వరకూ ర్యాలీ నిర్వహించారు. మైత్రేయి ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇదే సందర్భంగా మహిళలపై జరుగుతున్న హింసా వ్యతిరేక దినం సందర్భంగా మార్పు కోసం పరుగు పేరిట వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ గీత మాట్లాడుతూ ఈ-వ్యర్థాల నిర్వహణలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల పాత్ర కూడా ఎంతో కీలకమన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ ఈ-వ్యర్థాలులేని నగరంగా కాకినాడను తీర్చిదిద్దేందుకు మైత్రేయి సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. మైత్రేయి సంస్థ అధ్యక్షురాలు సీహెచ్ శశిఆదిత్యకుమార్ మాట్లాడుతూ ఈ-వ్యర్థాలను తమ కేంద్రానికి అందజేస్తే, సర్టిఫికెట్‌తో పాటు ప్రోత్సాహకాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్స్యూమర్ కమిషన్ సభ్యులు చాగంటి నాగేశ్వరరావు, ట్రస్ట్ హాస్పటల్ ఎండీ డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీచరణ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆదిత్యకుమార్, మైత్రేయి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

గడప లోపలే కులం.. బయట సమాజం

సహస్రావధాని గరికపాటి నరసింహారావు



మాట్లాడుతున్న సహస్రావధాని గరికపాటి నరసింహారావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): గడప లోపలే కులం ఉండాలని, గడప నుంచి బయటకొస్తే సమాజం గుర్తుకురావాలని సహస్రావధాని గరికపాటి నరసింహారావు అన్నారు. సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో 1923లో కాకినాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభలో కావ్యకంఠ గణపతిముని సమతా సందేశానికి వందేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక గాంధీనగర్ పార్కులో గోదావరి జిల్లాల సమతా సమ్మేళనం ఆదివారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథి గరికపాటి నరసింహారావు మాట్లాడుతూ సమాజం సర్వేశ్వరుడనుకుంటూ, నిరుపేదలను మనమందరం ఆదుకోవాలన్నారు. ఆకలిగా ఉన్న వాడికి గుప్పెడన్నం, అవసరమున్న వారికి సేవ చేయడం హైందవ ధర్మంలో ప్రధానమన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రాంత ప్రచారక్ ఆదిత్య మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను ఒక వర్గానికి పరిమితం చేయడం తగదన్నారు. అంటరానితనం నిర్మూలనకు ఆయన కృషి మరువలేనిదన్నారు.

దేశానికి దిక్సూచిగా రాజ్యాంగం

- జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ ప్రసాదరాజు


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


కరప ఎంపీడీఓ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


కరపలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

బాలాజీచెరువు: భారతదేశానికి దిక్సూచిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం అవతరించిందని జేఎన్‌టీయూకే వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు అన్నారు. జేఎన్‌టీయూకేలో ఆదివారం భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ముందుగా వర్సిటీ అవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ సెల్ లైజన్ ఆఫీసర్ కుమారస్వామి సభకు అధ్యక్షత వహించారు. వీసీ ప్రసాదరాజు మాట్లాడుతూ రాజ్యాంగం వల్ల దేశ పౌరులు స్వేచ్ఛగా మనగలుగుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఇంజనీరింగ్, మెడిసిన్‌పై ఆసక్తిగా ఉన్నారని, న్యాయ, ఆరోగ్య, తాత్విక, ఆధ్యాత్మిక అంశాలపై కూడా మంచిపట్టు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ రమణ, రిజిస్ట్రార్ సుమలత, డైరెక్టర్ బీటీ కృష్ణ ,ప్రముఖ న్యాయవాది సయ్యద్ సలార్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో..

రాజ్యంగ దినోత్సవాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కార్యాలయ ఏఓ జీవీఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. సుందరయ్య భవన్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఆదిత్య కళాశాలలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు అధ్యక్షతన వేడుకలు జరిగాయి. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులందజేశారు.

చట్టాలను తెలుసుకోవాలి

రాజ్యాంగంలో ఉన్న చట్టాలను ప్రతిఒక్కరూ తెలుసుకుని హెల్త్ అవేర్‌నెస్ సంస్థ అధ్యక్షుడు, అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గాంధీనగర్‌లో బుధవారం చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ముందుగా డాక్టర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. యువత సన్మార్గంలో నడిచేందుకు చట్టాలు, శిక్షలపై అవగాహన కల్పించాలన్నారు.

భారత రాజ్యాంగం అందరికీ శిరోధార్యం

కరప: భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే దేశపౌరులకు, ప్రభుత్వాలకు శిరోధార్యమని వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఏఓ గుత్తుల భీమశంకరరావు సిబ్బంది, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. కరప పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, సాదే లోహిదాస్ కుమార్, కార్యదర్శి ఎస్కే నాగేంద్రకుమార్ తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

మహోన్నతమైనది రాజ్యాంగమే..

కరప: ప్రపంచ దేశాలతో పోలిస్తే భారతరత్న, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగమే మహోన్నతమైనదని జెడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక చిరంజీవి కల్యాణ మండపంలో ఆదివారం సవిలే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రచయిత, సంస్థ వ్యవస్థాపకుడు సవిలే రాజేష్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. ప్రముఖ వక్త డాక్టర్ బైరి నరేష్, జర్నలిస్ట్ పానుగుమట్ల విష్ణుమూర్తి తదితరులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలన్నారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. డాక్టర్ బైరి నరేష్‌ను సంస్థ తరఫున ఘనంగా సత్కరించారు. అంబేడ్కర్ యువజన సేవా సంఘం మండల అధ్యక్షుడు చిన్నం వెంకటేశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, కరప, వేళంగి సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, సవిలే నీలిమ, డాక్టర్ భానుమతి, వైఎస్సార్ సీపీ నాయకులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్, మార్నెళ్ల వెంకటరమణ, రాష్ట్ర రజక సంఘం నాయకుడు వాడపర్తి కామేశ్వరరావు, పి.రజని, రిటైర్డ్ ప్రిన్సిపాల్ పాకా చంద్రరావు, సాంబత్తుల వెంకట్రావు, మద్దా ధనలక్ష్మి పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఎస్పీ నివాళి

కాకినాడ క్రైం: కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం ఆదివారం జరిగింది. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్.. రాజ్యాంగ, రాజ్యాంగ ఆమోద దినోత్సవ ప్రాధాన్యాన్ని వివరించారు. ప్రపంచంలోనే ప్రత్యేక విశిష్టతను భారత రాజ్యాంగం కలిగి ఉందన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వెంకట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో..

కాకినాడ జీజీహెచ్‌లో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా జరిగింది. సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఆస్పత్రిలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ హరి విజయకుమార్, డీసీఎస్ ఆర్ఎంవో డాక్టర్ అనిత, ఆర్ఎంవో డాక్టర్ రాహుల్, ఏపీఎన్‌జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, జిల్లా నాయకులు పాలపర్తి మూర్తిబాబు పాల్గొన్నారు.